క్లుప్తంగా

కనకదాస విగ్రహ ఏర్పాటుకు విరాళం



కురుబ సంఘం నేతలకు రూ.లక్ష విరాళం అందిస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: పట్టణంలో ఏర్పాటు చేయనున్న కనకదాస విగ్రహ ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్ రెడ్డి రూ.లక్ష విరాళాలన్ని శనివారం అందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కొడిగి గోవిందుతో పాటు కురుబ సంఘం నేతల సమక్షంలో నగదు అందించారు. కురుబ సంఘం నేతలు మాట్లాడుతూ కనకదాస విగ్రహ ఏర్పాటుకు అడిగిన వెంటనే యువనేత ప్రణయ్‌రెడ్డి విరాళం అందించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కురుబల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం నేతలు ధనంజయ, కోనాపురం వెంకటేష్, పెద్ద మల్లప్ప, చిన్న భీమా, కట్టే సాయి, గాదిలింగ, ప్రకాష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

కుందుర్పి: ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో జిల్లా కరువు పరిస్థితులపై దివంగత పి.ఉమాదేవి రచించిన అనంత కరువు, ఇనుప గజ్జెల తల్లి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా న్యాయవాది పద్మజ, జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మేదిని, సాహితీవేత్త, అష్టావధాని గురువేపల్లి నరసింహులు తదితరులు జిల్లా కరువు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, విశాలాంధ్ర మేనేజర్ చెట్ల ఈరన్న, ప్రతినిధులు లక్ష్మణమూర్తి, దిలీప్, శ్రీకాంత్, అంబుజా, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ పాయింట్‌లో చోరీ

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న సెల్ పాయింట్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండల కేంద్రానికి చెందిన రాము సెల్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేవాడు. దుండగులు సెల్ పాయింట్ షెట్టర్‌ను పైకి లేపి నాలుగు సెల్‌ఫోన్లు, డ్రిప్ వైరును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేష్ శనివారం తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి రూ.11 లక్షల విరాళం



దాతలను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

రాయదుర్గం రూరల్: మండలంలోని బొంద నకల్లు(రాతిబావి వంక) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్, మరియమ్మ యాడి దేవాలయ నిర్మాణం కోసం ముగ్గురు వ్యక్తులు శనివారం రూ.11 లక్షల విరాళమిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. డాక్టర్ తిప్పేస్వామి నాయక్ రూ.5 లక్షలు, డాక్టర్ ఝాన్సీ బాయి , ఆమె భర్త వేణు రూ.5 లక్షలు, జేఈ గంగాధర్ నాయక్ రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. విరాళం ఇచ్చిన దాతలను గ్రామపెద్దలు హరిశ్చంద్ర నాయక్, హేమ్లానాయక్, బాలాజీనాయక్, ఎంకానాయక్, నందు నాయక్, దేవేంద్రనాయక్ తదితరులు శాలువాలతో సన్మానించారు.

సామూహిక చర్యలతో వయ్యారిభామ నిర్మూలన



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త బాలాజీ నాయక్

కళ్యాణదుర్గం: రైతులు సామూహిక చర్యలతోనే వయ్యారి భామ మొక్కలను నిర్మూలించడం సాధ్యమవుతుందని కేవీకే శాస్త్రవేత్త బాలాజీ నాయక్ సూచించారు. స్థానిక కేవీకేలో శనివారం ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలంతో నిమిత్తం లేకుండా అన్ని రకాల భూముల్లో వయ్యారిభామ మొక్క మొలుస్తుందన్నారు. దీనిని నిర్మూలించేందుకు జబల్‌పూర్ డైరెక్టర్ ఆఫ్ వీట్ రీసెర్చ్ వారు ప్రతి ఏడాది ఆగస్టు 16–22వ తేదీ వరకూ జీవ వైవిధ్యం, మానవ, జంతు ఆరోగ్యంపై వయ్యారి భామ మొక్క చెడు ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ పార్థీనియం అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు.అనంతరం మొక్క చెడు ప్రభావంపై శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.మల్లికార్జున, ఆత్మ పీడీ మద్దిలేటి వివరించారు.

వైభవంగా 'శ్రావణ' పూజలు



రాయదుర్గంటౌన్: పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి



రాయదుర్గం రూరల్: అలంకరణలో విప్రమలై లక్ష్మీనవ నరసింహ స్వామి



రాయదుర్గం రూరల్: పూజలందుకుంటున్న అపులాపురం ఆంజనేయ స్వామి



కూడేరు: అలంకరణలో బసాపురం ఆంజనేయుడి మూలవిరాట్



కుందుర్పి: అలంకరణలో నాగేపల్లి యల్లమ్మ అమ్మవారు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు చెక్ పోస్టు వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్వామికి పంచామృతాభిషేకం, నవగ్రహ మూర్తులకు తైలాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. దాతలు రేకులకుంట సత్యనారాయణ, అనిత దంపతులు(లడ్డూ సూరి) సహకారంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. అలాగే పట్టణంలోని ఉక్కడ ఆంజనేయ స్వామి ఆలయం, శాంతినగర్‌లోని బైలాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రావణ పూజలు నిర్వహించారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని వజ్ర హొన్నూరు సమీపంలో అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అలాగే మల్లాపురం పరిధిలో వెలసిన విప్రమలై లక్ష్మీ నవ నరసింహ స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం , తులసీ అర్చన అనంతరం స్వామిని ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ ప్రత్యేకంగా అలంకరించి , విశిష్టపూజలు గావించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజినేయస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాతసేవ, పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ప్రత్యేకాలంకరణ, ఆకుపూజలు, తులసీమాలాధారణ ,ప్రత్యేక పుష్పాలకరణ నిర్వహించి మహామంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక వాహనాలు, వివిధ డిపోల నుంచి హనుమాన్‌దర్శన్ బస్సులు , ప్రైవేట్ వాహనాల్లో వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఇటు మురడి నుంచి, అటు కసాపురం నుంచి వచ్చిన వాహనాలు నేమకల్లులో కలవడంతో తీవ్రరద్దీ ఏర్పడింది. భక్తులకు ఎస్.ఎల్.వి. స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

కళ్యాణదుర్గం: కోటవీధిలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. శ్రావణ మాసం ప్రారంభంతో పట్టణంలోని ఆలయాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. ముఖ్యంగా వాసవీ మాత ఆలయం, సుబ్రమణ్యేశ్వర ఆలయం, సాయిబాబా ఆలయం, శివాలయం, అయ్యప్ప స్వామి ఆలయాల్లో ఉత్సవ మూర్తులను ప్రత్యేంగా అలంకరించి పూజలు జరిపారు.

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి, అన్నలపురి ఆంజనేయస్వామి,వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి, కుందుర్పి లక్ష్మీనృశింహస్వామి, నాగేపల్లి యల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి పూజలు చేపట్టారు.

కూడేరు: మండలంలోని బసాపురం, రామదుర్గం, కూడేరు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆంజనేయుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు.



కళ్యాణదుర్గం: అలంకరణలో లక్ష్మీ నరసింహ స్వామి



అమ్మవారి తాళిని చూపుతున్న పండితుడు

నేడు 'గడపగడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 4వ వార్డులో ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విభాగాల వారిగా అధికారులు హాజరు కావాలన్నారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ దాసానాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను పరిశీలించారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట, 75 వీరాపురం, గోనబావి, గుమ్మఘట్ట గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నరసింహామూర్తి శనివారం తెలిపారు. 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆధార్ సమస్య ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఈ–క్రాప్ తప్పనిసరి'

కుందుర్పి: ఖరీఫ్‌లో వర్షాధారం కింద వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు.శనివారం ఆయన వివిధ గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు.మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లోనూ డీఏపీ, యూరియా తదితర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.వేరుశనగ పంట వర్షాభావం వల్ల బెట్టకు గురై ఎండుముఖం పడుతోందని, బెట్ట నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ వెంట ఎంపీఈఓలు సిబ్బంది ఉన్నారు.

మహనీయులను స్మరించుకుందాం

కళ్యాణదుర్గం: దేశం కోసం పాటు పడిన మహనీయులను స్మరించుకుందామని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మన భూమి –మన దేశం కార్యక్రమాన్ని కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు . అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమములో పీఆర్‌డీఈ రాజన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం పణీంద్ర, ఫ్రీడమ్ ఫైటర్ కంబదూరు ఓబయ్య కుమారుడు సుధీర్, తహసీల్దార్ ఫణి కుమార్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, ప్రజా ప్రతినిధులు

ఇంకుడు గుంతలు తవ్వుకోండి

కూడేరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను వివరించి, ప్రతి ఇంటి ముందు తవ్వుకునేలా చైతన్య పరచాలని బుక్కరాయసముద్రం క్లస్టర్ ఏపీడీ అనురాధ గృహ నిర్మాణ శాఖ, ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. శనివారం ఆమె మండలంలోని కమ్మూరు, అరవకూరు గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న కందకాల పనులను తనిఖీ చేశారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దని సిబ్బందికి ఆదేశించారు. నిబంధనల మేరకు నాణ్యతగా పనులు చేస్తే కేటాయింపు మేరకు కూలి వర్తిస్తుందన్నారు. అనంతరం ఆమె కూడేరులో హౌసింగ్, ఉపాధి సిబ్బందితో సమావేశమై ఇంకుడు గుంతల తవ్వకాలపై సమీక్షించారు. ఇంకుడు గుంత తవ్వుకునేందుకు రూ.6 వేలు ప్రభుత్వం ఇస్తుందన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీఓ తులసీప్రసాద్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటో ద్విచక్రవాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాలకల్లుకు చెందిన నాగేంద్ర గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యాటకల్లు గ్రామానికి చెందిన నాగేంద్ర శనివారం ఉదయం ద్వి చక్ర వాహనంలో కొత్తూరుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా కొత్తూరు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టింది. ప్రమాదంలో అతడి కుడి కాలు విరిగింది. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులకు నేడు భూమిపూజ

రాయదుర్గం: డి హీరేహాళ్ మండల కేంద్రంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆదివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం చేపట్టనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి తెలిపారు. రాజీవ్‌గాంధీ, కురుబ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని అన్నీ గ్రామాల నాయకులు, అధికారులు హాజరుకావాలన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిబాయి

కళ్యాణదుర్గం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ డైరెక్టర్ సూచన మేరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ నార్త్ ఉన్నత పాఠశాలలో శనివారం దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాలలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు హెచ్ఎం గాయిత్రీ బాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు చల్లా కిరణ్‌చౌదరి, జూడో కోచ్ రమేష్, హ్యాండ్‌బాల్ కోచ్ మద్దిలేటి దుస్తులు పంపిణీ చేశారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

సంక్షేమం అభివృద్ధిలో ఏపీ అగ్రస్థానం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలిపారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాళాపురం గ్రామంలో రెండో రోజు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గడప గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు.అన్ని వర్గాల ప్రజలకు సీఎం అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు.

విడపనకల్లులో...

విడపనకల్లులో సచివాలయం –2 పరిధిలో మధ్యాహ్నం నుంచి కురుబ, ఉప్పర, సుంకలమ్మ దేవి కాలనీలో విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎలాంటి అవినీతి, రెకమెండేషన్ లేకుండా నేరుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా సంక్షేమ పథకాలు డబ్బులు అందుతున్నాయని విశ్వేశ్వరరెడ్డి ఎదుట మహిళలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద పిల్లల ఉన్నత చదువుల కోసం జగన్ ఎంతో తపన పడుతున్నారని,జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, వసతి దీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ తదితర పథకాల ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలోకి నేరుగా నగదును జమ చేసి ఆదుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, వైస్ ఎంపీపీ సునీతారాణి, భీంరెడ్డి, ఎస్సీసెల్ నాయకుడు సుంకన్న, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, రామాంజనరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకుడు హంపయ్య, ఉమాశంకర్, మేకల రామాంజనేయులు, ప్రకాష్‌గౌడు, దేశాయ్ సిద్దార్థ, దేశాయ్ మున్నా, మాజీ సర్పంచు దేశాయ్ చంద్రనాథ్, ఎంపీటీసీ ఓబుళేసు, తిమ్మారాజు, అంగి శీనా, హనుమంతు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యాలయం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బీటీపీ రోడ్డు అంబేడ్కర్ నగర్‌లో దళిత భవన నిర్మాణ కార్మిక సేవా సహకార సంఘం కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం చేపడతామని యూనియన్ అధ్యక్షుడు వన్నూరప్ప తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి తాపీ మేస్త్రీలు, కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రశాంతంగా వార్డు మెంబర్ ఎన్నిక

కూడేరు: మండలంలోని కలగళ్ల పంచాయతీలోని 9వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారురాలు మీనుగ లక్ష్మీదేవిపై టీడీపీ మద్దతుదారురాలు మల్లేశ్వరి గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను డీఎల్‌డీఓ సుమన జయంతి తనిఖీ చేశారు. సీఐ శేఖర్, ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఏఆర్‌ఓ హరి, ఎంపీడీఓ ఎంకే బాషా, ఈఓఆర్డీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి



పోలీసులతో చర్చిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి సుభాన్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నియోజకవర్గ స్థాయి పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌పై ప్రజలకు విస్తృతంగాఅవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ తేజమూర్తి, ఇతర మండలాల ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: మండలంలోని తూర్పుకోడిపల్లికి చెందిన లక్ష్మీదేవి కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న లక్ష్మీదేవిని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఇక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

దెయ్యం పట్టిందని..

కళ్యాణదుర్గం: పట్టణంలోని బ్రహ్మయ్య స్వామి గుడి సమీపంలో ఉన్న వడ్డే అమల అనే మహిళకు దెయ్యం పట్టిందని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా తనకు దెయ్యం పట్టిందని కుటుంబ సభ్యులతో వాపోయింది. భర్త మహేంద్ర పలుచోట్ల వైద్యం చేయించినా ఆమె ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమల పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

పొలం పనుల్లో రైతులు బిజీ



75 ఉడేగోళం గ్రామ సమీపంలోని వేరుశనగ పొలంలో దంతులు వేస్తున్న రైతులు

గుమ్మఘట్ట: పొలం పనుల్లో రైతులు బిజీబిజీగా వున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్ మండలాల వ్యాప్తంగా వర్షాధారం కింద 41,844 హెక్టార్ల సాగు విస్తీర్ణం కాగా ఇప్పటికే 34,361 హెక్టార్లలో వేరుశనగ పంటను అన్నదాతలు సాగుచేశారు. 6,248 హెక్టార్లలో పత్తి, 2,047 హెక్టార్లలో కంది, 742 హెక్టార్లలో కొర్ర, 2,619 హెక్టార్లలో మొక్కజొన్న, 3,522 హెక్టార్లలో ఆముదం, 1,405 ఎకరాల్లో రాగి, జొన్న, పొద్దు తిరుగుడు, సజ్జ పంటలు సాగు చేశారు. కాస్త వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలాల్లో ఎడ దంతులను వేస్తూ కలుపు మొక్కలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

'హనుమాన్ దర్శన్' కోసం ప్రత్యేక బస్సు

కళ్యాణదుర్గం రూరల్: శ్రావణ మాసంలో హనుమాన్ దర్శనం కోసం కళ్యాణదుర్గం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డీఎం రామచంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కసాపురం, మురడి, నేమకల్లులో ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి మంగళవారం, శనివారం ఏదో ఒక రోజు అవకాశం కల్పిస్తామన్నారు. కళ్యాణదుర్గం డిపో నుంచి పెద్దలకు రూ.435, పిల్లలకు రూ.225 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: ఏఐఎస్ఎఫ్ కళ్యాణదుర్గం నియోజకవర్గ మహాసభల సందర్భంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి టీ సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కళ్యాణదుర్గం నూతన కమిటీ ఎన్నుకున్నారు, అధ్యక్షుడిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, వంశి, ఈశ్వర్, నకిన్ సిద్ధూ, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్, సహాయ కార్యదర్శులుగా వరుణ్ ప్రకాష్, మని భాస్కర్, కోశాధికారిగా సావన్, మరో 31 మంది కార్యవర్గ సభ్యులు, 59 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.